క్లుప్తంగా

ప్రజలకు అండగా నిలవండి



ఆత్మకూరు: వాయుగుండం ప్రభావంతో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వర్షాలు మరో 48 గంటల పాటు కురవనున్న నేపథ్యంలో పెన్నా నది, వాగులు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్రజలకు సాయం అందించాలని పిలుపునిచ్చారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



సీతారామపురం: స్థానిక పడమటివీధిలోని రామాలయం వద్ద అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు మహేష్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 1వ వార్డుకు చెందిన కోయి పెదనరసయ్య, యేసుపోగు దొరసానమ్మ, 12వ వార్డుకు చెందిన శాగలమూరి పెంచలయ్య, 15వ వార్డుకు చెందిన గంధళ్ల నాగేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులకు ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్టు నిర్వాహకులు బుధవారం నగదు చెక్కులను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహ నిర్మాణాలు వేగవంతం

సీతారామపురం: మండలంలో పలు దశల్లో ఉన్న పక్కాగృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పక్కాగృహ నిర్మాణాల పురోగతిపై బుధవారం ఆయన సమీక్షించారు. 2021–22లో మంజూరైన గృహాలను మార్చిలోగా పూర్తిచేయకుంటే రద్దు చేయనున్నట్లు తెలిపారు. అడ్వాన్సు పేమెంట్లు పొందిన లబ్ధిదారులు, ఆర్‌సీ దశల్లో ఉన్న పక్కాగృహాలను డిసెంబరు 31లోగా పూర్తిచేయాలన్నారు. హౌసింగ్ ఏఈ రామకృష్ణారావు, ఏపీఓ సుభాషిణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గిరిజనులను ఆదుకోవాలని వినతి



జలదంకి: జలదంకి దొరువుకట్ట, గౌరవరం మేజర్ కాలువ కట్టపై నివసిస్తున్న గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ జూలీ భాయికు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 50 కుటుంబాల గిరిజనులు కాలువ కట్టపై గుడిసెలు వేసుకుని ఏన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేయలేదన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు మూడ్రోజులుగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆహార సదుపాయాలు కల్పించాలని కోరారు. సీపీఎం నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, ఆంథోనీబాబు, నరసింహం పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న యానాదమ్మ

మర్రిపాడు: బస్సులో తనకు దొరికిన నగల బ్యాగును పోలీసుల ద్వారా బాధితులకు అందజేసి ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆవులపోలు యానాదమ్మ తన నిజాయతీని చాటుకుంది. వివరాలు..యానాదమ్మ బుధవారం హైదరాబాద్ నుంచి మర్రిపాడుకు బస్సులో బయలుదేరింది వస్తూ నంద్యాల వద్ద పక్కసీట్లో బ్యాగును గుర్తించింది. అందులో పరిశీలించగా 9 తులాల బంగారం, వెండి ఆభరణాలు ఉన్నాయి. దీంతో మర్రిపాడు పోలీసుల ద్వారా నంద్యాలకు చెందిన దంపతులదిగా గుర్తించి వారు మర్రిపాడుకు రాగా అందజేశారు. దీంతో యానాదమ్మను పోలీసులు అభినందించారు.



కావలి: వేట సామగ్రిని భద్రపరుచుకుంటున్న మత్స్యకారుడు



బిట్రగుంట: పిల్లివాగులోని చిల్లచెట్లను తొలగిస్తున్న అధికారులు



కావలి మండలంలో వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న పొలాలు

కుంభవృష్టి

- మూడ్రోజులుగా ఎడతెరిపివ్వని వర్షం
- స్తంభించిన జనజీవనం
- ముంపులో లోతట్టు ప్రాంతాలు
- పొంగుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



కావలి: కావలి-తుమ్మలపెంటరోడ్డులో కొనదిన్నె వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

కావలి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కావలి నియోజకవర్గంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వాన పడుతుండడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కావలి పట్టణంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. డ్రైనేజీలు సక్రమంగా లేక వర్షపునీరు రోడ్లపై చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం కావలిలో 174.4 మి.మీ, దగదర్తిలో 68.4 , బోగోలులో 51.6, అల్లూరు మండలంలో 50.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

కావలి ఎమ్మెల్యే క్షేత్ర పరిశీలన

పట్టణంలో వర్షం వల్ల తలెత్తిన పరిస్థితులను ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బుధవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి వైకుంఠపురంలోని అన్నపగుంటను పరిశీలించి నీరు నిల్వ ఉండడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలకృష్ణారెడ్డినగర్‌లో వర్షంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మద్దూరుపాడులోని టిడ్కో గృహాలను సందర్శించి వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని గమనించి మోటార్లతో తొలగించాలని కమిషనర్‌కు సూచించారు.

అల్లూరు: మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మూడ్రో జులుగా కురుస్తున్న వర్షాలకు అల్లూరు–ఇస్కపల్లి రోడ్డు అధ్వానంగా తయారవడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అల్లూరు చెరువు నిండు కుండలా మారి కలుజు పారుతోంది. పైడేరును ఆనుకుని ఉన్న పురిణి, కొత్తపాలెం, తుఫాన్‌నగర్ గ్రామాలను తహసీల్దార్ లక్ష్మీనారాయణ సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. కాగా వాయుగుండం ప్రభావంతో సముద్రం కసురు మీద ఉండడంతో ఇస్కపల్లి తీరంలోని మత్స్యకారులు తమ పడవలు, వలలను జాగ్రత్త చేసుకున్నారు.

ఉదయగిరిలో ఓ మోస్తరు వర్షం

ఉదయగిరి: ఉదయగిరిలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న వానలతో జనజీవనం స్తంభించింది. గుడినరవ ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిపై చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పిల్లాపేరు, దున్నపోతుల వాగులు జలకళను సంతరించుకున్నాయి. గండిపాళెం జలాశయంలో రెండు అడుగుల మేర నీరు చేరినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వింజమూరు మండలంలోని చాకలకొండ, వింజమూరు పాతూరు, బత్తినవారిల్లి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వింజమూరు తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్ దెబ్బతినడంతో పలు గదులు తడిసి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని అధికారులు యంత్రాల సాయంతో బయటకు పంపారు.

కలిగిరి: వాయుగుండం ప్రభావంతో మండలంలో బుధవారం కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. చిన్నఅన్నలూరు పంచాయతీలోని మిడతవాగు ఉధృతంగా ప్రవహించింది. ఎస్సై ఉమాశంకర్ జేసీబీ సాయంతో కల్వర్టు వద్ద ప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపచెట్లను తొలగించారు. కలిగిరి పంచాయతీ పరిధిలోని వెంకన్నపాళెం ఎస్టీకాలనీలోని 19 గిరిజన కుటుంబాలను తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు భోజన సౌకర్యం కల్పించారు.

కొండాపురం: మండలంలో మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కొమ్మి–అగ్రహారం మధ్యన ఉన్న మిడతవాగు, కొమ్మి వద్ద ఉన్న గండికట్ల చెరువు కలుజు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో కావలి-కొండాపురం నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. పార్లపల్లి, రామానుజపురం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

పొంగిన వాగులు

జలదంకి: వాయుగుండం ప్రభావంతో మండలంలో మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చెరువులు నిండాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలదంకి, బ్రాహ్మణక్రాక గిరిజన కాలనీల్లోని ప్రజలను స్థానిక పాఠశాలలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. చామదల, కమ్మవారిపాళెం గ్రామాల మధ్యన ఉబ్బలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తిగా నిండి కలుజు పారడంతో గ్రామానికి రాకపోకలు ఆగిపోయాయి. గోపన్నపాళెం వద్ద ఊళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో తిమ్మసముద్రం, అన్నవరం, గట్టుపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కృష్ణాపాడు వద్ద చీకటివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొత్తపాలెం, బోయిలపాడు, వేములపాడు, సోమవరప్పాడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. కాగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రమీల, ఎస్సై లతీఫున్నీసా సూచించారు.

దుత్తలూరులో 68.8 మి.మీ వర్షపాతం

దుత్తలూరు: మండలంలో బుధవారం 68.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ముత్తరాశిపల్లిలోని గూబల వాగు చెరువును తహసీల్దార్ యనమల నాగరాజు పరిశీలించారు. అనంతరం దుత్తలూరు ఊరకొండ దిగువ భాగాన ఉన్న గిరిజన కాలనీని సందర్శించి స్థానికులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వరికుంటపాడు: మండలంలో బుధవారం 95.6 మి.మీ వర్షపాతం నమోదైంది. పిల్లాపేరు, ఉప్పువాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరికుంటపాడు నుంచి కనియంపాడు, రామదేవులపాడు తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న పిల్లా పేరు వాగుకు ఇరువైపులా ఎస్సై రఘునాథ్ తన సిబ్బందితో ముళ్లకంచెవేయించారు. నక్కలగండి రిజర్వాయర్‌లో కొంతమేర వర్షపు నీరు చేరగా ఎస్సై పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

సోమశిల జలాశయాన్ని పరిశీలించిన డీఎస్పీ

సోమశిల: సోమశిల జలాశయాన్ని ఆత్మకూరు డీఎస్పీ కె వేణుగోపాల్ బుధవారం పరిశీలించి వరద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమ్మవారిపల్లి వద్ద చప్టాను పరిశీలించారు. వర్షాలకు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. సోమశిల ఎస్సై అనూష ఉన్నారు.

బీరాపేరును పరిశీలించిన అధికారులు

అనుమసముద్రంపేట: వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి కొండమీదకొండూరు వద్ద బీరాపేరు వాగుపై ఉన్న బ్రిడ్జిని పరిశీలించి అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని గ్రామస్తులకు సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమై సహాయ చర్యలపై దిశానిర్దేశం చేశారు. గుడిపాడులోని వాగును తహసీల్దార్ శ్రీరాంకృష్ణ, ఎస్సై సైదులు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

సంగంలో ఎడతెరిపి లేని వర్షం

సంగం: మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తు న్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.పెన్నా పరివాహక ప్రాంతాలైన వీర్లగుడిపాడు, కోలగట్ల గ్రామాల్లో బోట్లు సిద్ధంగా ఉంచారు. బీరాపేరు, బొగ్గేరు ఉధృతంగా ప్రవహిస్తే పెరమన, చెన్నవరప్పాడు గ్రామాలకు రాకపోకలు స్తంభించే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మర్రిపాడు చెరువు కట్ట దెబ్బతినడంతో ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్ బస్తాలతో రింగ్ బండ్ ఏర్పాటు చేశారు. వంగల్లులోని కలుజు వద్ద పోలీసు, రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి సిబ్బందిని ఉంచారు. సీఐ వేమారెడ్డి, తహసీల్దారు సోమ్లానాయక్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

సంగం బ్యారేజ్ నుంచి నీరు విడుదల

సంగం బ్యారేజ్‌కు 4,405 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువకు 100, ఎన్‌టీఎస్ చానల్‌కు 50, ఇంటెక్‌వెల్‌కు 40 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. 12 షట్టర్ల ద్వారా 4215 క్యూసెక్కులను సముద్రానికి విడుదల చేస్తున్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

చేజర్ల: వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని సూచించారు. చేజర్ల, అనంతసాగరం మండలంలో బుధవారం ఆర్డీఓ పర్యటించారు. టీకేపాడు, పడమటికంభంపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట చేజర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య, అనంతసాగరం తహసీల్దార్ వీరవసంతరావు, వీఆర్వో అశోక్ ఉన్నారు.



కావలి: టిడ్కో గృహాల వద్ద వర్షపు నీటిని పరిశీలిస్తున్న కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి



బిట్రగుంట: జడగోగుల-ఏనుగులబావి రోడ్డులోని చప్టా వద్ద ముళ్లకంపను తొలగిస్తున్న పోలీసులు



కొండాపురం: పార్లపల్లిలో ఓ ఇంట్లో చేరిన వర్షపునీరు



అల్లూరు: పైడేరువాగును పరిశీలిస్తున్న తహసీల్దార్



బిట్రగుంట: జువ్వలదిన్నె హార్బర్ వద్ద తమిళనాడు మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్



అల్లూరు: ఇస్కపల్లి రోడ్డుపై చేరిన వర్షపు నీటిలో వాహనచోదకుల పాట్లు

50 ఎకరాల్లో వరి పంట నష్టం



సీతారామపురంలో నేలవాలిన వరిపైరు

సీతారామపురం: మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 50 ఎకరాల్లో వరిపంట నేలవాలినట్లు ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మండలంలో 114 హెక్టార్లలో వరి పంట సాగు చేయగా, యాభై ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. మండలంలో ఇంకా ఎక్కడైనా పంటనష్టం జరిగి ఉంటే వర్షం ఆగిన తర్వాత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంట నష్టం అంచనాలను తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు.



జలదంకి: ఊళ్ల వాగు పొంగడంతో ట్రాక్టర్‌పై వెళ్తున్న గోపన్నపాళెం గ్రామస్తులు



జలదంకి: చామదల వద్ద ఉబ్బల వాగులో వెళ్లకుండా కంప వేస్తున్న దృశ్యం

ఆస్పత్రికి గర్భిణుల తరలింపు



సోమశిల: ముందస్తుగా ఆస్పత్రికి గర్భిణులను తరలిస్తున్న వైద్య సిబ్బంది

సోమశిల: మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న వాగు ఉధృతంగా ప్రవహస్తే కచిరిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. ఆయా గ్రామాల్లో ఇద్దరు నిండు గర్భిణులు ఉండడంతో వైద్యసిబ్బంది ముందస్తుగా జేసీబీ మీద జాగ్రత్తగా వాగు దాటించి 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించినట్లు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



ఉదయగిరి: చాకలకొండ చెరువులో చేరిన సాగునీరు



దుత్తలూరు: ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్



సంగం: వంగల్లు కలుజు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తీరంలో ‘అల’జడి

బిట్రగుంట: బోగోలు మండలం తాటిచెట్లపాళెం వద్ద సముద్రంలో అలల ఉధృతి బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా పెరిగింది. వాయుగుండం నెల్లూరుకు సమీపంలోకి వచ్చేసరికి మధ్యాహ్నం నుంచి సముద్రంలో కసురు మరింతగా పెరిగి అలలు సాధారణంగా కన్నా ఎక్కువగా తీరాన్ని తాకుతున్నాయి. స్థానిక మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తగా వలలు, పడవలు తీరానికి దూరంగా తరలించి భద్రపరుచుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు, వాయుగుండాలు చెన్నై–నెల్లూరు మధ్యన తీరం దాటితే జిల్లాలోని తీరప్రాంత గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. భారీ ఈదురు గాలులు, వర్షాల కారణంగా తీరం చిగురుటాకులా వణికిపోతుంది. తీరప్రాంత గ్రామాలకు రాకపోకలు కూడా నాలుగైదురోజుల పాటు నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. దీంతో తీరంలోని బంగారుపాళెం, కొత్తబంగారు పాళెం, పాతబంగారుపాళెం, అలిచెర్లబంగారుపాళెం, తాటిచెట్లపాళెం, కడపాళెం, కొత్తకడపాళెం, టెంకాయచెట్లపాళెం, తదితర గ్రామాల్లోని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కాగా అధికార యంత్రాంగం గ్రామాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్సై తీరంలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముంగమూరు వద్ద పిల్లివాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న ముళ్లకంపను, గుర్రపుడెక్కను జేసీబీల సాయంతో తొలగించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద నిలిచిపోయిన తమిళనాడు బోట్లను తహసీల్దార్ పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడారు. వాయుగుండం ముప్పు తప్పే వరకూ సముద్రంలోకి వెళ్లొద్దని సూచించారు.



చేజర్ల: తిరుపతినాయుడుపల్లి ఎస్సీకాలనీలో వర్షపు నీటి తొలగింపు



ఏఎస్‌పేట: బీరాపేరు వాగును పరిశీలించిన ఎంపీడీఓ ప్రసన్నకుమారి



చేజర్ల: టీకేపాడులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఆత్మకూరు ఆర్డీఓ పావని



కలిగిరి: మిడతవాగు వద్ద కంపను తొలగిస్తున్న ఎస్సై ఉమాశంకర్



కలిగిరి: వెంకన్నపాళెం గిరిజనులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న తహసీల్దార్



జలదంకిలో చెరువును తలపిస్తున్న పొలాలు

సబ్సిడీపై వరి, శనగ విత్తనాలు

ఆత్మకూరురూరల్: రైతులకు వరి, శనగ విత్తనాలను 25 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు ఏఓ కిషోర్‌బాబు తెలిపారు. చెర్లోయడవల్లి రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శనగ విత్తనాలు ఒకరకం కిలో రూ.94 కాగా, సబ్సిడీపై రూ.70.50, మరో రకం కిలో రూ.121 కాగా, సబ్సిడీపై రూ.90.80కు అందజేస్తున్నామని తెలిపారు. వరి విత్తనాలు ఒక రకం కిలో రూ.40.50, మరోరకం రూ.41.50 ఉండగా, రూ.5 చొప్పున సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. వీఏఏ శ్రీహర్ష పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: శ్రీకొలను, అనుమసముద్రంలోని రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రజని విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. కిలో వరి విత్తనాలకు సూడోమోనాస్, ఫ్లోరిసెన్స్ 8 గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ ఒక గ్రాము లేదా ట్రైసైక్లోజోల్ 2 గ్రాములను కలిపి శుద్ధి చేసుకోవాలని సూచించారు. రబీ సాగుకు కేఎన్‌-1638, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాలు అనుకూలమని, నవంబర్ 15 తరువాత నార్లు పోసుకోవాలని తెలిపారు. ఏఈఓ చిరంజీవి, వీఏఏలు తులసి, రమ, వీహెచ్‌ఏ చంద్రబాబు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

సంగం: మండల కేంద్రమైన సంగానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. నెల్లూరులో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. ఎంత వెతికినా కుమార్తె జాడ తెలియకపోవడంతో బుధవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2.36 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం



కాటేపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.36 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. వింజమూరు మండలం కాటేపల్లి, వింజమూరు, నందిగుంట, రావిపాడు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాతిలోగా రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డీఈఈ మణికుమార్, ఏపీడీ గాయత్రిదేవి, ఏఈ తిరుమలయ్య, టీడీపీ నాయకులు కంభం విజయరామిరెడ్డి, రఘు, జూపల్లి రాజా, వనిపెంట సుబ్బారెడ్డి, యన్నం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.